# ఎన్నికలు

ఎన్నికలొస్తున్నాయి—

నాలుగు పెద్ద పార్టీల వారితో బాటు ఇద్దరు ఏ పార్టీకి చెందని అభ్యర్థులు కూడా ఆ నియోజక వర్గంనుండి పోటీ చేస్తున్నారు. వారిలో శివరావుగారొకరు.

శివయ్య కార్మికుల పేటకు పెద్ద కాకపోయినా, ఆ పేటలో అతని మాట కెదుర్లేదు.

శివరావుగారు కాకిచేత కబురంపితే చాలు, ఆ కబురును శిరసావహిస్తాడు శివయ్య. అందుకనే ఆయన తరపున ఎన్నికలలో తిరుగుతున్నాడు.

శివరావు గారిది ధర్డ్ ఫారమ్ పోయింది. శివయ్యదీ పోయింది. అయితే యేం? శివరావుగారు మూడంతస్తుల మేడలోనూ, శివయ్య మూడు గదులు కూడా లేని పాకలోనూ ఉంటున్నారు.

డబ్బుంది కాబట్టి ఆయన శివరావుగారయ్యారు. డబ్బులేదు కాబట్టి అతను శివయ్యగాడయ్యాడు.

డబ్బులేకపోతే శివరావుగారూ-శివయ్యగాడే. డబ్బుంటే శివయ్యగాడూ-శివరావుగారే.

'నాగలి భుజాన వేసుకున్న రైతు'—శివరావుగారి ఎన్నికలగుర్తు.

నాగలి భుజాన వేసుకున్న రైతు బొమ్మలను పెద్ద యెత్తున చేయించి, ముఖ్యమైన ప్రాంతాలలో పెట్టించారు. రాత్రిపూటకూడ అది కనిపించటం కోసం లైటింగ్ పెట్టించారు.

పార్టీ జనాభా అంతా కలసి రకరకాల నినాదాలు తయారు చేశారు.

'జై కిసాన్! జై శివరావ్!!'

"నిజమైన సోషలిజం రావాలంటే శివరావుగారికే మీ ఓటు!"

"చేతిలో చెయ్యేసి చెప్పు చెల్లీ! నీ ఓటు రైతు గుర్తుకే అని చెప్పు తల్లీ మళ్ళీ!!"

'దున్నే వాడిదే భూమి కావాలంటే—

శివరావు గారికే ఓటు వేయండి!'

—ఇందులో ఏ నినాదం గురించీ శివయ్య పట్టించుకోలేదుకాని, ఆఖరి నినాదం చదువుతుంటె మాత్రం మనసులో ఏదో పీకింది. దాని క్కారణం-నిజంగా శివరావుగారి ఎన్నికైతే దున్నేవాడిదే భూమి చేస్తారా —అనే ఆలోచన.

"భూ సంస్కరణలు అమలులోనికి వస్తాయని తెలుసుకుని, తన నమ్మకస్థుల కిద్దరికి రాసేసి, కొంత అక్కడలేని బడికోసం, కొంత కద లాకో కట్టరో తెలియని గుడి కోసం రాసేసి, మిగిలిన పదెకరాలు అమ్మేసి బ్యాంకులో నిల్వ చేసుకున్న శివరావుగారు నిజంగా దున్నేవాడిదే భూమిచేస్తారా?" - ఈ ఆలోచన పదేపదే కదిలింది శివయ్య అంతరంగంలో. కాని గర్భగుడి దాటి బైటికి రాలేని దేవుడి రాతి విగ్రహంలా-ఆ ఆలోచన బైటికి రాలేదు.

మిల్లులో ఎవరితోనో మాట్లాడి శివయ్యకు లీవ్ ఇప్పించారు శివరావుగారు. (తండ్రి చావుబ్రతుకుల్లో వున్నాడని సెలవడిగితే ఇవ్వని మేనేజిమెంట్ ఇప్పుడెలా సెలవిచ్చిందో శివయ్యకర్థం కాలేదు.)

ఇరవై రోజులనుంచీ ప్రొద్దున్నే శివయ్య గురించి గారొస్తోంది. శివయ్య గురించే కాకుండా శివయ్య కుటుంబం గురించి కూడా శివరావు గారే చూస్తున్నారు.

ఇంక ఎలక్షను మూడు రోజులే వుందనగా కారులో పోతున్నాడు శివయ్య—

కారు బస్టాపు ప్రక్కనుంచే పోతుండగా, తన మిల్లులో పని చేస్తున్న కార్మికులు క్యూలో నించుని వుండటం చూశాడు శివయ్య—

'అబ్బ! ఎలా నుంచున్నారో, ఎప్పుడో అర్ధగంట తర్వాత వచ్చే బస్సు కోసం ఇప్పటినుంచీ! బస్సు వస్తుంది—ఎక్కుతారు. బస్సు నిండా ఒహటే జనం. ఇంత రష్‌లో కాకపోతే హాయిగా ఏ కారులోనో పోకూడదూ!" అనిపించింది శివయ్యకి.

రేపు ఎలక్షననగా ఇవేళకూడా కారుకోంచి కాలు క్రిందపెట్టకుండా తిరిగాడు శివయ్య. రాత్రి ఇంచుమించు పడుకోలేదు.

రాసక్రీడలు చేస్తున్నపుడు ఒక్కొక్క గోపికతో ఒక్కొక్క రీతిగా వుండేవాడు శ్రీకృష్ణుడని ఎక్కడో కాని విన్నాడు శివయ్య. కానీ ఎన్నికల ముందు శివరావుగారిని చూస్తుంటే శ్రీకృష్ణుడే మళ్ళీ ఇలా పుట్టాడా అనిపించింది శివయ్యకు.

తన కులంవారితో కులం సంగతి గుర్తుచేస్తూ, పేదవారికి భూములిపిస్తానసీ, హరిజనులకు ఇళ్ళు కట్టిస్తానసీ చెబుతూ, ధనవంతులతో ఇదంతా నటనని చెబుతూ—

"ఇందుగలడందులేడని సందేహమువలదు" అన్నట్టు ప్రతివారితోనూ తానొకరిగా మసలారు శివరావుగారు.

శివరావుగారిని చూస్తే శివయ్యకి శ్రీ కృష్ణ పరమాత్ముడు గుర్తు వస్తే, కొంతమందికి ఏ పాత్రలో పడితే ఆ పాత్రలో తిరిగే చెంబా గుర్తొచ్చింది.

ఎలక్షన్ రోజు—

పోలింగ్ కేంద్రంవారు ఓటువేసినట్టు పెట్టిన గుర్తును ఎలా చెరప వచ్చో ముందుగానే ఆలోచించి, కొన్ని దొంగ ఓట్లు వేయించుకున్నారు శివరావుగారు.

ఊరిలో లేనివారివి, చచ్చిపోయినా లిస్టుల్లో ఇంకా బ్రతికేవున్న వారివి—ఇలాటి కొన్ని ఓట్లు అదే వయస్సు వారిచేత వేయించారు.

ఇక శివయ్య హడావిడికి అంతే లేదు. ఏమూల ఎన్ని ఓట్లున్నాయి. ఎంత మంది ఓటు చేసారు, ఇంకా ఎంతమంది వేయాలి?—ఇలాటి విషయాలను ఎప్పటికప్పుడు సేకరిస్తూ, కారులోపోయి జనాన్ని తెస్తూ (బూత్‌కి వచ్చేటపుడు మాత్రమే కారు. ఓటేసిన తరువాత అక్కర్లేదు—ఈ విషయం శివరావుగారు అతనికి ముందే చెప్పారు.) చాలా హడావిడిగా తిరిగాడు.

పోలింగ్ పూర్తయింది. సాయంత్రం శివరావుగారి మేడమీద చిన్న సమావేశం. అందులో ఉజ్జాయింపు ఓట్ల లెఖ్ఖ—ఆలెక్కల ప్రకారం శివరావుగారి విజయానికేమీ ఢోకా లేదని అనుకోవటం—ఇదంతా ముగిసింది.

రాత్రి పదకొండవుతుండగా ఇల్లు చేరాడు శివయ్య—

"ఎవరో పిలుస్తారు, కారొచ్చేస్తుంది" అనే ఆలోచనతో పడుకోవ టం ఈ మధ్య అలవాటయింది శివయ్యకి. కారు హారను వినిపించినట్లయి మెలకువ వచ్చేసింది పెంద్రాళే. వీధిలోకెళ్ళి చూశాడు. హారనూ లేదు, కారూ లేదు

భార్య అడిగింది "ఏమిటా హడావిడి?" అని

"కారింకా రాలేదేమిటే?" గొణుక్కుంటున్నట్టుగా అన్నాడు శివయ్య

''బాగానేవుంది. ఇంకెందుకొస్తాది కారు!''.

నిద్ర మత్తు పూర్తిగా వదిలిపోయింది శివయ్యకి. 'అవును తను మరిచే పోయాడు. ఎన్నికలయిపోయాయి. శివరావుగారు గెలిచినా ఓడినా తనకోసం కారు మరిరాదు. మళ్ళా తనూ తన గొర్రెతోకలాటి జీవితం మిగిలారు'

"ఈ రోజు మిల్లుకూడా వెళ్ళాలి!" ఈ ఊహతో శివయ్య మన సంతా నీరసం ఆవహించింది.

వెళ్ళాలి! వెళ్ళక తప్పదు!!

మళ్ళీ మిల్లు! మిల్లు కెళ్ళడానికి బస్సు!! బస్సెక్కడానికి క్యూ!!!

-నించున్నాడు శివయ్య. ఎన్నికల గురించి ఎవరెవరో పలకరించారు. అందరికీ బదులు చెప్పాడు శివయ్య.

ఆ చెప్పటంలో అతనిలో ఏదో దిగులు కనిపించిందేమో, రామయ్య అడిగాడు శివయ్య భుజంమీద చెయివేసి ''ఏరా! కారుల్లో తిరిగిం తర్వాత ఈ జీయితం అసయ్యంగా కనిపిత్తోందా!''

శివయ్య మాట్లాడలేదు.

రామయ్య శివయ్యకి దూరపు చుట్టం, దగ్గర నేస్తం. అందుకే చెప్పటం మొదలు పెట్టాడు—

''పది రోజులు కారుల్లో తిరిగిన ఇంత నీకే బాధగా వుంది గదా! మన పోలారంలో సుబ్బిగాడికి తింటానికి రెండు పూటలా వుండేది గాదు. ఆడు ఎన్నికల్లో ఆడికీ ఈడికీ తగువెట్టి నెగ్గినాడు. అయిదరాబాదులో మరేం ఎవ్వారం నడిపాడో మంతిరి కూడా అయిపోనాడు. ఆడా అయిదేళ్ళు పూరిగుడిసొదిలేసి ఇందరబమనంలాంటి ఇంటిలో, ఆంతకు ముందు రిచ్చాకూడా ఎక్కనోడు—దయ్యమంత కారులో తిరిగాడు.

పదవిగాని పోతే కారు, ఇల్లు వుండవు గందా, అందుకే ఆడా పదవిలో వుండగానే రెండిళ్ళు, ఓ కారు కొన్నాడు. అది ఆడి తప్పంటే నాను ఒప్పుకోను. పెజల్లోంచి వస్సిన మనిసికి మంతిరయ్యాడుకదాని గొప్పగా బతకడం అలవాటు సేస్తే ఆల్లలాగే బతకాలనుకుంటారు. ఆల్లే కాదు. నువ్వైనా, నానైనా కూడా అంతే! నాయకులు కూడా మామూలు మనుషుల్లాగా బతికితేగందా, ఆల్లకి మన కట్టాలు తెలిసేది? ఆల్లు మనకన్నా గొప్పగా బతికితే మన కట్టాలెలా తెలుత్తాయి?" ఇంకా ఏదో చెప్పుకు పోతున్నాడు రామయ్య తాత.

"ఎవడి దగ్గిర డబ్బుందో వాడే ఎన్నికల్లో నెగ్గి తీరుతాడు అని తెలుసుండి కూడా ఇంకా ఎన్నికల్లో నిలబడటం వాడితరపున ప్రచారం ఇదంతా ఏమిటి, దీనికి మార్పెలా వస్తుంది.?" అనే ఆలోచనలో పడ్డాడు శివయ్య.